VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఆదివారం 04 ఆగష్టు 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 08



2లో

సాగర్‌కు పెరుగుతున్న వరదప్రవాహం

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## అసెంబ్లీలో బిఆర్ఎస్ గొంతు నొక్కారు

చర్చలకు అవకాశం లేకుండా చేశారు

కెసిఆర్‌ను తిట్టేందుకు సభను నడిపారు

మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి విమర్శలు

2లో



## శ్రీశైలంలో పర్యాటకుల సందడి

ప్రాజెక్ట్ అందాలు వీక్షించేందుకు భారీగా రాక

వాహనాలతో పదికిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్



2లో



## మహిళలకు 20వేల కోట్ల వడ్డీలేని రుణాలు

బడ్జెట్‌లో కేటాయింపులు చేసినం

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

**ఖమ్మం:** తెలంగాణలోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ముదిగొండ మండలం కమలాపురంలో మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో భట్టి మాట్లాడుతూ... మధిర నియోజకవర్గంలో కొద్ది రోజుల్లోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు. అంగన్ వాడీలో 3వ తరగతి వరకు ఏర్పాటు చేసి నాల్గోతరగతికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలుకు పంపించే ఏర్పాటుకు నాంది పలికామని అన్నారు. అలాంటి పాఠశాలలు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందిరమ్మ డైరీ చిరకాల వాంఛ ఇదని వివరించారు.

నియోజకవర్గంలోని మహిళలను పాడి పరిశ్రమలో వాటాదారులుగా చేసి వారిని పారిశ్రామిక వేత్తలుగా చేయడానికి 2014కు ముందే ఇందిరమ్మ డైరీని ప్రవేశ పెట్టామని వెల్లడించారు.

నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు గేదెలు ఇచ్చి వారిని పరిశ్రమలో వాటా దారులుగా చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగే విధంగా ఆర్థికమంత్రిగా బడ్జెట్ ప్రవేశ పెట్టామని తెలిపారు. నియోజకవర్గంలో మిగిలిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు త్వరలోనే ప్రారంభిస్తామని మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.

# సిఎం అమెరికా పర్యటన...

**హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అమెరికా ప్రయాణం ప్రారంభం కానుంది. శనివారం రాత్రి ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయల్దేరి వెళతారు. మధ్యాహ్నానికి ఆయన అమెరికా చేరుకుంటారు. దాదాపు పదిరోజుల పాటు అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో జరిగే ఈ టూర్‌లో వివిధ పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ టూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కూడా ఉన్నారు. వేకువజామున 4.35 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కలిసి అధికారుల బృందంతో అమెరికా, దక్షిణ కొరియా టూర్‌కు వెళతారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఈ బృందం న్యూయార్క్ చేరుకుంటుంది. ఆరోజు విశ్రాంతి తీసుకున్న తర్వాత నాల్గో తేదీ నుంచి అధికారిక కార్యక్రమాల్లో సీఎం బృందం పాల్గొంటుంది.

నాల్గో తేదీన మొదట న్యూజెర్సీలో ఉన్న ప్రవాస తెలంగాణ ప్రజలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అవుతారు. వీలున్నంత వరకు రాష్ట్రాభివృద్ధి కోసం ప్రయత్నాలు చేయాలని వారిని కోరనున్నారు. అనంతరే ఐదారు తేదీల్లో వాణిజ్య, వ్యాపార ప్రతినిధులతో న్యూయార్క్‌లో రేవంత్ టీం సమావేశం కానుంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించనుంది. ఆరో తేదీ పెప్సికో, హెచ్‌సీఏ ప్రతినిధులతో చర్చలు జరుపుతారు. న్యూయార్క్ నుంచి వాషింగ్టన్ చేరుకొని



అక్కడ వరల్డ్ బ్యాంకు ప్రతినిధులతో భేటీ అవుతారు. ఏడో తేదీన డల్లస్‌లో బిజినెస్ సంస్థల ప్రతినిధులతో మరో భేటీ ఉంటుంది. అక్కడ గాంధీ స్మృతి కేంద్రాన్ని సందర్శిస్తారు. తర్వాత రోజు శాన్‌ఫ్రాన్సిస్కోలో యాపిల్ ఉత్పాదక బృందం, ట్రైనెట్ సీఈవో, ఇతర వ్యాపర సంస్థల ప్రతినిధులు, 9న గూగుల్, అమెజాన్ సంస్థ ప్రతినిధులతో సమావేశమవుతారు. ఆ రోజు సాయంత్రం తెలంంగాణ ఎన్‌ఆర్‌ఐలతో మాట్లాడనున్నారు. అక్కడి నుంచి సీఎం నేరుగా దక్షిణకొరియా చేరుకుంటారు. సియోల్‌లో 12,13 తేదీల్లో ఎల్జీ, శామ్‌సంగ్ సహా వివిధ వ్యాపార సంస్థల అధినేతలతో భేటీ అవుతారు. తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం ఉన్న పరిస్థితులు వాళ్లకు వివరించనున్నారు. అనంతరం అక్కడ నుంచి బయల్దేరి హైదరాబాద్ చేరుకుంటారు. పద్నాలుగు రోజుల పాటు ముఖ్యమంత్రి అమెరికా, దక్షిణ కొరియా దేశాల పర్యటన చేయనున్నారు. ఆగస్టు 14 వరకూ సీఎం షెడ్యూల్ కొనసాగనుంది. సీఎం వెంట సీఎస్ శాంతి కుమారి, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబులు సైతం విదేశాలకు వెళ్లనున్నారు. ఆగస్టు 5 వ తేదీన మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అమెరికా వెళ్లనున్నారు. నేటి నుంచి 9 వ తేదీ వరకూ న్యూయార్క్, వాషింగ్టన్, డల్లాస్ , శాన్ ప్రాన్సిస్కో, నగరాల్లో పర్యటించనున్నారు. అమెరికాలో పలువురు వ్యాపార వేత్తలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోనుంది. 5వ తేదీన న్యూయార్క్ కాగ్నిజెంట్ సీఈఓతో భేటీ కానున్నారు. 6న పెప్సికో, హెచ్‌సీఏ ఉన్నతాధికారులతో సమావేశంతో పాటు ఐటి సంస్థలతో భేటీ కానున్నారు. 7న చార్లెస్ స్కాబ్ హెడ్, మహాత్మా గాంధీ మెమోరియల్‌ను సందర్శించనున్నారు. 8వ తేదీన కాలిఫోర్నియాలో ట్రినెట్ సీఈఓ, ఆరమ్, ఆమ్ జెన్ సంస్థల ప్రతినిధులతో భేటీ కానున్నారు. 9న గూగుల్ సినియర్ ప్రతినిధులతో సమావేశం జరిగింది. 10న అమెరికా నుంచి బయలుదేరి 11న దక్షిణ కొరియాకు సీఎం బృందం వెళ్లనుంది. 12న సియోల్‌లో యూయూ పార్క్, కొరియన్ ఫెడరేషన్ ఆఫ్ టెక్స్టైల్ ఇండస్ట్రీ ప్రతినిధులతో సమావేశం కానుంది.

## ఎస్సీ వర్గీకరణ కేసు సుప్రీంలో అనుమతి

సుప్రీం మాజీ సిజెఐ జస్టిస్ ఎన్వి రమణ చొరవ

కృతజ్ఞతలు తెలిపిన మందకృష్ణ మాదిగ



**న్యూఢిల్లీ:** మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణతో ఎమ్మార్పీఎస్ చీఫ్ మందకృష్ణ మాదిగ శనివారం భేటీ అయ్యారు. ఎన్వీ రమణ సీజేఐగా ఉన్నప్పుడు సుప్రీంలో ఎస్సీ వర్గీకరణ కేసు విచారణ జరిగింది. పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన కేసును విచారణకు అనుమతించి సీజేఐగా ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి ఎన్వీ రమణ పంపించారు. ఎస్సీ వర్గీకరణ కేసును సుప్రీంకోర్టులో అనుమతించినందుకు మాజీ సీజేఐను కలిసి మందకృష్ణ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమించిన మంద కృష్ణ మాదిగ బృందాన్ని ఈ సందర్భంగా మాజీ సీజేఐ ఎన్వీ రమణ అభినందించారు. కాగా... ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఆగస్టు 1న సుప్రీం కోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాష్ట్రాలు చేయొచ్చని తెలిపింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు,ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ,ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని ఉన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. 2004లో ఐదుగురు సభ్యులు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేసింది. 6:1తో సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పును వెలువరించారు. సుప్రీం తీర్పుపై స్పందించిన మందకృష్ణ మాదిగ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. గతంలో చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు చేసిన ఎస్సీ వర్గీకరణపై ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇప్పుడు అది ఏపీలో అమలు అవుతుందన్నారు. చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ అమలు జరుగుతుందన్న నమ్మకం తమకు ఉందని తెలిపారు. నాటి సందర్భంలో సీఎంగా ఎస్సీ వర్గీకరణను చంద్రబాబు నాయుడు అమలు చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు న్యాయం వైపు తీర్పు చెప్పిందని.. ధర్మమే గెలిచిందన్నారు. అధర్మం తాత్కాలికంగా గెలిచినా ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని ఆనాడు కన్నీళ్లతో ఇక్కడి నుంచి వెళ్లిపోయామని అన్నారు. ఈ విజయం కోసం 30 ఏళ్లు తపనతో కూడిన పోరాటం చేసామన్నారు.

ఈ 30 ఏళ్ల పోరాటంలో అమరులయిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి బిడ్డలకు ఈ విజయం అంకితం చేస్తున్నామన్నారు.

## వయనాడు సహాయకచర్యల్లో అద్భుతం

కొండలో చిక్కుకున్న గిరిజన కుటుంబం గుర్తింపు

అతి కష్టం మీద కిందకు తీసుకుని వచ్చిన అటవీ బృందం

బృందాన్ని అభినందించిన కేరళ సిఎం విజయ్

**వయనాడ్:** కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఓ వైపు మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అదే సమయంలో సహాయకచర్యల్లో సిబ్బంది నిరంతరాయంగా శ్రమిస్తోంది. ఈ రక్రమంలో గిరిజన కుటుంబాన్ని కాపాడిన తీరు ఇప్పుడు సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. విపత్తులో కొండ చరియలు విరిగిపడటంతో గ్రామాల ఆనవాళ్లు లేకుండా పోయాయి. వందల ఇళ్లు నేలమట్టమయ్యాయి. వందల మంది బురద మట్టిలో కూరుకుపోయారు. విపత్తు నిర్వహణ బృందాలు, సైనికులు నేటికీ



సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. కాగా కల్పేట ఫారెస్ట్ ఆఫీసర్ కె.హాషిస్ నేతృత్వంలోని రెస్క్యూ బృందం తమ ప్రాణాలకు తెగించి ఓ గిరిజన కుటుంబాన్ని రక్షించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అధికారులు తెలిపిన వివరాల మేరకు... ఇంకా అక్కడక్కడ కొండ చరియలు విరిగిపడుతున్నా సహాయక బృందం సహాయక చర్యలు కొనసాగిస్తోంది. ఈ సమయంలో అటవీ ప్రాంతంలో ఉన్న లోయకు ఎదురుగా ఉన్న కొండపై ఓ గిరిజన కుటుంబం చిక్కుకొని ఉండడాన్ని బృందం గమనించింది. వారిని ఎలాగైనా కాపాడాలనే ఉద్దేశంతో నాలుగున్నర గంటల పాటు శ్రమించి తాళ్ల సహాయంతో కొండపైకి చేరుకున్నారు. అక్కడ పనియా తెగకు చెందిన ఓ గిరిజన కుటుంబం గుహలో చిక్కుకొని ఉండగా వారిని రక్షించారు.

## పాలేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

ధరణి తప్పులను గుర్తించని బిఆర్ఎస్

మంత్రి పొంగులేటి విమర్శలు



ఖమ్మం: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ నుంచి నీటిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విడుదల చేశారు. సొంత నియోజకవర్గమైన పాలేరు పాత కాలువకి నీటిని విడుదల చేయడం జరిగిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఓడిపోవడానికి కారణం ధరణి అన్న సంగతి ఈరోజుకి కూడా వాళ్ళు తెలుసుకోకపోవడం దురదృష్టకరం అన్నారు. అప్పటి పీసీసీ ప్రెసిడెంట్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మా ప్రభుత్వం రాగానే ధరణిని తీసుకెళ్లి బంగాళాఖాతంలో కలుపుతామని ఆనాడే చెప్పామన్నారు.

## మూసీ బఫర్‌జోన్ 50 మీటర్లు

మూసీనదికి 50 మీటర్ల బఫర్‌జోన్‌తో సరిహద్దుగా నిర్ణయించి నిర్మాణాలకు నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీలు) జారీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది.


ఈ ప్రకారం ఎన్‌వోసీల జారీకి అనుమతి ఆదేశాలు జారీ చేసిన నీటిపారుదల శాఖ



4లో

వేగుచుక్క

TELUGU DAILY NEWS



తెలంగాణ

2

ఆదివారం 04 ఆగస్టు 2024


# రెండు లక్షల ఉద్యోగాల భిక్ష కెసిఆర్‌దే

హైదరాబాద్:దేశంలో 2లక్షల 2 వేల ఉద్యోగాలు భర్తీ చేసింది కేసీఆర్ మాత్రమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేయలేదని ఆయన తెలిపారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శనివారం పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తన సవాలుకు కాంగ్రెస్, బీజేపీ నోరు మెదపడం లేదని విమర్శించారు. నిరుద్యోగుల కోసం తాము కొట్లాడుతుంటే.. దానం నీచమైన మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. దానం మాటలన్నీ నిరుద్యోగులను ఉద్దేశించినవేనని చెప్పారు. దానం బెదిరింపులకు భయపడేవాళ్లు ఎవరూ లేరని స్పష్టం చేశారు. దానం చేసిన వ్యాఖ్యలపైనా కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నడిబొడ్డున తిరుగుతున్నా.. ఎక్కడికి రమ్మంటావో చెప్పు అంటూ సవాలు విసిరారు. లక్ష్మారెడ్డి, సుధీర్ రెడ్డి ఉప్పల్‌లో ఉరికించింది మరిచిపోయావా అని ప్రశ్నించారు. దానం నాగేందర్ రెడ్డికి ఎమ్మెల్యే పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష అని కౌశిక్ రెడ్డి తెలిపారు. దానం నాగేందర్‌కు సిగ్గుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ఇచ్చిన 30వేల ఉద్యోగాలు కూడా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చినట్లుగా చెప్పుకుంటున్నారని పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సిగ్గులేకుండా అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. అసెంబ్లీలో శుక్రవారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్‌పైనా కౌశిక్ రెడ్డి విమర్శలు గుప్పించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగ ఖాళీల వివరాలు లేవని ఆయన అన్నారు. జాబ్ క్యాలెండర్‌పై ఎవరి సంతకం లేదని పేర్కొన్నారు. తేదీలు, ఉద్యోగ ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి.. ఇప్పుడు సీఎం, డిప్యూటీ సీఎం సిగ్గులేకుండా అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులపై ఇష్టమొచ్చినట్లుగా అసభ్య పదజాలంతో దూషించిన దానం నాగేందర్‌పైనా కౌశిక్ రెడ్డి సీరియస్ అయ్యారు.

# అసెంబ్లీలో బిఆర్ఎస్ గొంతు నొక్కారు



**హైదరాబాద్**అసెంబ్లీలో బీఆర్ఎస్ గొంతు నొక్కారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్‌ను తిట్టుడు.. గత ప్రభుత్వంపై ఆరోపణలతోనే సభ నడించిందని అన్నారు. అసెంబ్లీని కౌరవ సభలా నడిపించారని వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. కళ్లున్న కబోధి రేవంత్ రెడ్డి అని విమర్శించారు.జీరో అవర్ మొత్తం ఎత్తివేశారని, ప్రశ్నోత్తరాలు లేకుండా చేశారని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సభలో చర్చలకు అవకాశం ఇవ్వలేదని.. ప్రజా సమస్యలపై మాట్లాడదామంటే మైకులు కట్టేశారని.. ఇదేంటని అడిగితే మార్షల్స్‌తో బయటకు తరలించారని మండిపడ్డారు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను తిట్టడానికే అసెంబ్లీని వినియోగించు కున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. ఏడు నెలల్లోనే రేవంత్ రెడ్డి వికృతరూపం బయటపడిందని విమర్శించారు. రేవంత్ రెడ్డిది ప్రజాపాలన కాదు.. నియంతృత్వ పాలన అని ఎద్దేవా చేశారు. ఇంత అధ్వాన్నంగా సభ ఎప్పుడూ జరగలేదని అక్బరుద్దీన్ కూడా అన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ మిత్రపక్షమని చెబుతున్న ఎంఐఎం కూడా కాంగ్రెస్ తీరును తప్పుబట్టిందని తెలిపారు. రేవంత్ సభా నాయకుడిగా కాకుండా అటవిక రాజులా వ్యవహరించారని అన్నారు. సీఎం ఇష్టారాజ్యంగా సభను తప్పుదు దోవ పట్టించారని విమర్శించారు. ఏ చర్చపై కూడా పూర్తిగా మాట్లాడనివ్వేదని అన్నారు. హామీలను అమలు చేయడమే లక్ష్యంగా తాము మాట్లాడామని తెలిపారు. రాష్ట్ర బ్జడెట్‌లో ఆరు గ్యారంటీలు, 420 హామీల గురించి ఎక్కడా ప్రస్తావించలేదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలైనా వంద రోజుల్లో అమలుచేస్తామన్న హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అబద్దాలు చెప్పారని అన్నారు.తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎక్కడైనా ఉద్యోగాలు భర్తీ చేస్తారా అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగులను ఎంపిక చేస్తే.. ఈ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఒప్పందంలో వ్యవసాయ మోటార్లకు మినహాయింపు ఉందని అన్నారు. ఆ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి తొక్కిపెట్టి తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అబద్దాల్లో రేవంత్ రెడ్డికి గిన్నిస్ బుక్ రికార్డు ఇవ్వాలని ఎద్దేవా చేశారు.

## కూచిపూడి నర్తకి యామినీ కృష్ణమూర్తి కన్నుమూత



**న్యూఢిల్లీ:** ప్రముఖ భరతనాట్య, కూచిపూడి నర్తకిగా ఖ్యాతిగాంచిన యామినీ కృష్ణమూర్తి (84) కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆమె.. దిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో 1940లో జన్మించారు. యామినీకి 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, 2016లో పద్మ విభూషణ్ పురస్కారాలతో కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. గతంలో తితిదే ఆస్థాన నర్తకిగా కూడా ఆమె సేవలందించారు. దిల్లీలో 'యామినీ స్కూల్ ఆఫ్ డ్యాన్స్' స్థాపించి ఎంతో మంది యువతకు భరత నాట్యం, కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇచ్చారు. ఏ ప్యాషన్ ఫర్ డ్యాన్స్ పేరుతో పుస్తకం రచించారు.

# శ్రీశైలంలో పర్యాటకుల సందడి



శ్రీశైలం శ్రీశైలం జలాశయం పదిగేట్లను ఎత్తడంతో ఆనకట్టకు సందర్శకుల తాకిడి పెరిగింది. వారంతం కావడంతో శనివారం తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. ఆనకట్ట వద్దకు చేరుకుని శ్రీశైలం జలాశయం రేడియల్ క్రస్ట్‌గేట్ల నుంచి పరుగులు తీస్తున్న కృష్ణమ్మ పరవళ్లను చూస్తూ ఉత్సాహంగా గడిపారు. దీంతో జలాశయం పరిసర మార్గాల్లో వాహనాలు బారులు తీరాయి. తొలుత శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు, సందర్శకులు ఆ తర్వాత జలాశయం వద్దకు చేరుకుని కృష్ణమ్మ అందాలను వీక్షించారు. దీంతో ఆనకట్టకు ఇరువైపులా వాహనాలు భారీగా రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. లింగాల గట్టు ప్రాంతంలో చేపల విక్రయాలు చేస్తుండటంతో ట్రాఫిక్ మరింతగా పెరిగింది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో చేపలు పట్టడంపై నిషేధం ఉన్నా.. లింగాల గట్టు ప్రాంతంలో అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేపల విక్రయాలు నిషేధిస్తే ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని వాహనదారులు, ప్రయాణికులు చెబుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో శ్రీశైలం జలాశయం 10 క్రస్ట్ గేట్ల ద్వారా 4,64,740 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 62,668 క్యూసెక్కుల నీటిని అదనంగా నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 4,81,246 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం శనివారం మధ్యాహ్నం సమయానికి 882.80 అడుగులు, నీటి నిల్వ 203.490 టీఎంసీలుగా నమోదైంది. సహజంగానే వీకెండ్ రోజుల్లో శ్రీశైలం మహా పుణ్య క్షేత్రానికి వచ్చే భక్తులు..

ఇలా రద్దీ విపరీతంగా పెరిగింది. డ్యాం దగ్గర గేట్లు ఎత్తటంతో.. నీటి ప్రవాహాన్ని చూసేందుకు జనం ఎక్కడపడితే అక్కడ తమ వాహనాలు ఆపేస్తుండటంతో.. శ్రీశైలం ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్ జాం అయ్యింది. 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు క్లియర్ చేస్తున్నా.. ఎప్పటికప్పుడు భారీగా వస్తున్న వాహనాలతో చాలా నిదానంగా ముందుకు కదిలాయి వాహనాలు. వ్యూ పాయింట్ నుంచి దోమల పెంట వరకు ఫుల్ ట్రాఫిక్ నెలకొంది. శ్రీశైలం ప్రాజెక్ట్ 10 గేట్లు ఎత్తడంతో డ్యామ్ చూసేందుకు పర్యటకుల తాగిడి పెరిగింది. రెయినీ సీజన్ లో నల్లమల్ల అందాలను వీక్షించడానికి టూరిస్టులు క్యూ కడుతున్నారు. మెయిన్ రోడ్డు పక్కనే వాహనాలు నిలిపడంతో ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతుంది. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు శ్రీశైలం పోలీసులు అవస్థలు పడ్డారు.

# సహకార వ్యవస్థలో ఈ-కేవైసీ అమలు



**విజయవాడ** సహకార వ్యవస్థలో ఈ-కేవైసీ అమలు చేసి పారదర్శకంగా సేవలు అందిస్తామని వ్యవసాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలు రైతు చట్టం రద్దు చేసి, త్వరలో కొత్త చట్టం తీసుకొస్తామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అన్ని విధాలా సేవలు అందించి, కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని అన్నారు.విజయవాడలో శనివారం నిర్వహించిన ఆప్కాబ్ రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశానికి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలురైతు చట్టం రద్దు చేసి.. త్వరలో కొత్త చట్టం తెస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రతి కౌలు రైతుకు న్యాయం జరగాలని తెలిపారు. కౌలు రైతులను సహకార సంఘాల్లో సభ్యులుగా చేర్చి రుణాలు ఇస్తామని అన్నారు. నేటి నుంచే వ్యవస్థలో మార్పు రావాలి.. లోపాలు సరిదిద్దాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సహకార సంఘాల్లో అవినీతి జరిగిందని వస్తున్న వార్తలపై విచారణ చేయిస్తామని హెచ్చరించారు. ఆప్కాబ్ వాట్సాప్ బ్యాంకింగ్ సేవలు ప్రారంభిస్తా

రని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వానికైనా, ప్రజలకైనా వ్యవసాయం మరియు సహకార సంఘాలు అత్యంత ప్రాధాన్యమైనవి అన్నారు. ఈ రంగాలు లేని సమాజాన్ని కూడా ఊహించలేమన్నారు. 2019లో తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేసి 2016లో చేసిన చట్టాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. భూ యజమాని అంగీకారం ఉంటేనే కార్డు ఇవ్వాలని మెలిక పెట్టడంతో, గతంలో వచ్చిన ప్రయోజనాలు కూడా అందక రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ప్రతి కౌలు రైతుకు బ్యాంక్ రుణాలు, ప్రభుత్వ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సహకార వ్యవస్థలో ఈ-కేవైసీ అమలు చేసి పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. కౌలు రైతులను సహకార సంఘాల్లో సభ్యులుగా చేర్చి రుణాలు అందించాలని, చిట్టచివరి కౌలు రైతుకు కూడా న్యాయం జరగాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా సహకార సంఘాలను తీర్చిదిద్దాలని, నూతన సంస్కరణలతో రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సొంత రైతులే వ్యవసాయాన్ని వదిలేస్తున్న నేపథ్యంలో, సాగు బాధ్యతను కౌలు రైతులే తీసుకుంటున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో 90 శాతానికిపైగా కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారన్నారు. సీసీఆర్‌సీ పేరిట అనాలోచిత చట్టాన్ని తెచ్చి అన్నదాతలను గత ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. సీసీఆర్‌సీ కార్డులు రాక, ప్రభుత్వ ప్రయోజనాలు అందక, రైతులు కష్టాల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, కూటమి ప్రభుత్వం రాకతో రైతాంగానికి మళ్లీ మంచిరోజులు రావాలని, వ్యవసాయానికి ఊతమిచ్చేలా సహకార వ్యవస్థ పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. కౌలు రైతులకు రుణాలు సులభంగా అందే పరిస్థితి రావాలని, ఇప్పటికే రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేశారన్నారు.

ప్రకృతి వైపరీత్యాలు కూడా రైతులను చుట్టుముట్టడటంతో చేతికొచ్చిన పంట పాడవుతోందని, రెక్కలు ముక్కలు చేసుకుని పంట పండించినా రాబడి లేక అన్నదాత తీవ్రంగా నష్టపోతున్నాడన్నారు. ఈ క్రమంలో పెత్తందారులకు కాకుండా పేదరికంలో ఉన్న నిజమైన రైతులకు రుణాలు ఇవ్వాలని, డిజిటైలెజేషన్ తో అక్రమాలకు తావులేకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. సహకార సంఘాల్లో అవినీతి జరిగిందని వస్తున్న వార్తలపై విచారణ జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రతి రైతు భూమిని వెబ్ ల్యాండ్‌లో పెట్టి గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆప్కాబ్ - డీసీసీబీ, సహకార సంఘాల ద్వారా మహిళా సంఘాలకు అధిక శాతం రుణాలను అందించాలన్నారు. అన్ని జిల్లాల్లో ఆప్కాబ్ మరియు డీసీసీబీ శాఖలను విస్తరించి ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించాలన్నారు. అలాగే, సహకార బ్యాంకులకు మరియు సంఘాలకు రావల్సిన బకాయిలను అందజేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి శాఖల అడ్మినిస్ట్రేషన్‌లో తనకంటూ ఒక బ్రాండ్ ఉందని.. తాను సేవలందించే శాఖలకు మరింత వన్నె తీసుకురావడమే తన లక్ష్యమన్నారు.

# అధ్యక్ష అభ్యర్థుల మధ్య చర్చ

## కమలతో చర్చకు సిద్ధమన్న ట్రంప్

**వాషింగ్టన్:**అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అధికార డెమోక్రటిక్ పార్టీ తరపున కమలా హారిస్ అభ్యర్థిత్వం ఖరారైంది. ఈ నేపథ్యంలో ఆమెతో ముఖాముఖి చర్చ జరిపేందుకు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమయ్యారు. ఈ మేరకు ఫాక్స్‌న్యూస్ ఆఫర్‌ను ఆయన అంగీకరించారు. ఈవిషయాన్ని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో తాజాగా వెల్లడించారు. వచ్చే నెలలో వీరి మధ్య డిబేట్ జరగనుంది. సెప్టెంబరు 4న ఫాక్స్ న్యూస్ నిర్వహించే ఈవెంట్‌లో కమలా హారిస్ తో డిబేట్ జరిపేందుకు అంగీకరించా. వాస్తవానికి ఇదే తేదీన ఏబీసీ ఛానల్‌లో జో బైడెన్‌తో నేను ముఖాముఖి చర్చలో పాల్గొనాల్సింది. అధ్యక్ష రేసు నుంచి ఆయన వైదొలగడంతో ఆ డిబేట్ రద్దయ్యింది. ఫాక్స్‌న్యూస్ డిబేట్ పెన్సిల్వేనియాలో జరుగుతుంది. బైడెన్‌తో జరిగిన చర్చలోని రూల్స్ అన్నీ దీనికి వర్తిస్తాయి. కానీ ఈసారి పూర్తిస్థాయిలో ప్రేక్షకులు కూడా ఉంటారని ట్రంప్ వెల్లడించారు. అయితే.. ఈ డిబేట్, దాని కండీషన్స్‌కు హారిస్ అంగీకరించారా? లేదా అన్నది మాత్రం ఇంకా తెలియరాలేదు. ట్రంప్‌తో చర్చ గురించి ఆమె ప్రతినిధులు ఇంకా స్పందించలేదు. అయితే, ఆయనతో ముఖాముఖి చర్చకు తాను సిద్ధమేనని గతంలో కమలా హారిస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటికి ఆమె అభ్యర్థిత్వం ఖరారు కాకపోవడంతో ట్రంప్ దానిపై స్పందించలేదు. తాజాగా హారిస్ పోటీ ఖాయమవడంతో డిబేట్‌కు అంగీకరిస్తున్నట్లు మాజీ అధ్యక్షుడు పేర్కొన్నారు. కమలా హారిస్, ట్రంప్ మధ్య ముఖాముఖి చర్చ జరిగితే.. అది ఈ ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరగనున్న రెండో డిబేట్ కానుంది. జూన్‌లో బైడెన్, ట్రంప్ మధ్య తొలి డిబేట్ జరిగిన సంగతి తెలిసిందే. ఆ చర్చకు ప్రేక్షకులను అనుమతించలేదు. ఆ డిబేట్ తర్వాతే బైడెన్ అభ్యర్థిత్వంపై సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత మరింత తీవ్రమైంది. దీంతో అధ్యక్ష రేసు నుంచి ఆయన వైదొలిగి కమలా హారిస్ పేరును ప్రతిపాదించారు.

# బ్రహ్మోత్సవాలకు చురుకుగా ఏర్పాట్లు



అధికారులతో సమీక్షించిన అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల: తిరుమలలో మరో రెండు నెలల్లో ప్రారంభం కానున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు టీటీడీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంధి సన్నద్ధం కావాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. శనివారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఇంజినీరింగ్ పనులు, వాహనాల ఫిట్‌నెస్, లడ్డూ స్టాక్, అన్నప్రసాదం, దర్శనం, వసతి, టీటీడీ విజిలెన్స్, భద్రతా విభాగం భద్రతా ఏర్పాట్లపై తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా అక్టోబర్ 4న ధ్వజారోహణం, 8న గరుడసేవ , 9న స్వర్ణరథం, 11న రథోత్సవం, 12న చక్రస్నానం ఏర్పాట్లపై చర్చించారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహన సేవాలు ఉంటాయని వివరించారు.


గరుడ సేవ కోసం యాత్రికుల పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, అక్టోబర్ 7న రాత్రి 11 గంటల నుంచి అక్టోబర్ 8 అర్ధరాత్రి వరకు కొండపైకి ద్విచక్ర వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐలు, శిశువులు ఉన్న తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలు,
అన్ని ఆర్జిత సేవలు, రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# కేదార్‌నాథ్‌లో చిక్కుకున్న తెలుగువారు



(పాత చిత్రం)

న్యూఢిల్లీ:ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నారు. కేదార్‌నాథ్ ప్రాంతంలో అయితే కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కేదార్‌నాథ్‌కు వెళ్లిన అనేక మంది యాత్రికులు వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఎదురయ్యింది. అలాగే పలువురు తెలుగు యాత్రికులు కూడా కేదార్‌నాథ్ వద్ద వరదల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. క్లౌడ్ బరస్ట్, భారీ వర్షాల కారణంగా నడక మార్గం దెబ్బతిన్నది. గౌరీకుండ్ - కేదార్‌నాథ్ మధ్య 13 చోట్ల మార్గం విధ్వంసమైంది. దీంతో పలువురు యాత్రికులు ఎక్కడికక్కడ చిక్కుకుపోయారు. దీంతో పోలీసులు, సహాయక బృందాలు యాత్రికులను హెలీకాప్టర్లతో తరలిస్తున్నారు. అయితే అక్కడి ప్రతికూల వాతావరణం సహాయ చర్యలకు విఘాతం కల్గిస్తున్నది. స్థానికులకే ప్రాధాన్యతనివ్వడంతో దూరప్రాంత యాత్రికులు అక్కడే నిలిచిపోయారు. దీంతో ఆహారం, నీరు అందక యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా.. కేదార్‌నాథ్ స్వర్గ రోహిణి కాటేజిలో పలువురు తెలుగు యాత్రికులు సహాయం కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు మెసేజ్ చేశారు. ఆహారం, నీరు దొరక్క ఇబ్బందులు పడుతున్నామని తమకు సహాయం అందించాల్సింది గా కేంద్రమంత్రిని తెలుగు యాత్రికులు కోరారు. వెంటనే స్పందించిన బండి సంజయ్.. ఉత్తరాఖండ్ అధికార యంత్రాంగంతో మాట్లాడారు. వారిని సురక్షితంగా బయటకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.









# తల్లి పాలలోనే

## అద్భుతమైన శక్తి ఉంది.

**జిజిఎచ్ సూపరెండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్.**

**ఘనంగా జిజిహెచ్ లో తల్లిపాల వారోత్సవాలు.**

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, ఆగస్టు 3**

తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠమని, తల్లి పాలలోనే అద్భుతమైన శక్తి ఉందని జిజిఎచ్ సూపరెండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్ అన్నారు. సిడిపిఓ డిచ్పల్లి వారి ఆధ్వర్యంలో జిజిహెచ్ లో శనివారం నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో డాక్టర్ ప్రతిమరాజ్ పాల్గొని, మాట్లాడారు. 9 నెలలు మోసి, కన్న బిడ్డలను పెంచడంలో తల్లి పాత్ర ప్రముఖమైనదని, తల్లిపాలలో అద్భుతమైన శక్తి ఉంటుందని, పుట్టిన బిడ్డకు వెంటనే స్తన్యం ఇవ్వడం చాలా అవసరమని తెలిపారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ఆగస్టు 1నుండి 7 వ తేదీ వరకు ప్రపంచ దేశాలలో తల్లిపాల వారోత్సవాలను జరుపుకుంటారని తెలిపారు. తల్లిపాలు బిడ్డలకు పోషకాలను అందించడమే కాకుండా పసి వయసులో వ్యాధుల బారిన పడకుండా కాపాడుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి స్వర్ణలత, కోఆర్డినేటర్ రంజిత్, అంగన్వాడీ టీచర్లు సురేఖ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



# బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి.

**- బీసీ సంక్షేమ సంఘం డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, ఆగస్టు 3:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణలు ఇచ్చిన పిలుపు మేరకు శనివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు, కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు చేస్తూ వెంటనే కుల గణన చేపట్టి, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. అప్పుడే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీసీల ప్రాతినిత్యం పెరుగుతుందని, చట్టసభల్లోకి బీసీలు అధికంగా అడుగుపెట్టే అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. 42శాతం రిజర్వేషన్ల కల్పనతో సామాజిక న్యాయం చేకూరుతుందని అన్నారు. తమ డిమాండ్ ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని అదనపు కలెక్టర్ అంకిత్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బొబ్బిలి నర్సయ్య, జిల్లా అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఏనుగందుల మురళీ, జిల్లా కార్యదర్శులు శివకుమార్ ముదిరాజ్, నరేందర్, సురేష్, బీసీ యువజన సంఘం జిల్లా ఇన్చార్జి శ్యాం, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నవాతే ప్రతాప్, ప్రధాన కార్యదర్శి తివిటి చైతన్య చంద్ర, జిల్లా అధికార ప్రతినిధి అమంద్ ప్రవీణ్ కుమార్, నగర కార్యదర్శి శివ, సభ్యులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్

**కారు ఢీకొని బాలుడు మృత్యువాత**

**హైదరాబాద్:** గోల్కొండ ఇబ్రహీంబాగ్‌లో కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చిన కారు ఓ బాలుడి ప్రాణాలు తీసింది. డిగ్రీ చదువుతున్న యువకుడు మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసి ఓ ప్రాణాన్ని బలితీసుకోగా మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గోల్కొండ ఇబ్రహీంబాగ్‌లో ఏడేళ్ల బాలుడు, తల్లిదండ్రులు ద్విచక్రవాహనం పై వెళ్తున్నారు. అయితే అదే సమయంలో సన్ సిటీ నుంచి ఇబ్రహీంబాగ్ వైపు శ్రీనాథ్ అనే యువకుడు తన కారులో వస్తున్నాడు. ఫుల్‌గా మద్యం సేవించిన యువకుడు రాంగ్ రూట్‌లో వెళ్లి అతివేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బాలుడు సూర్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. చిన్నారి తల్లిదండ్రులకు తీవ్రగాయాలు అయ్యాయి. అయితే యువకుడు మద్యం సేవించాడని, కారులో సైతం మద్యం బాటిళ్లు ఉన్నట్లు స్థానికులు చెపుతున్నారు. సమాచారం అందుకున్న గోల్కొండ పోలీసులు

హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద సమయంలో కారులో శ్రీనాథ్ ఒక్కడే ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బాధితులను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# విద్యతో విజ్ఞానం, విలువలు పెంపొందించుకోవాలి.

**పట్టుదలతో కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.**

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్ధసారథి పిలుపు.**

**చిట్ల ప్రమీల జీవన్ రాజ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్సెస్సీ టాపర్లకు అవార్డులు ప్రదానం.**









**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, ఆగస్టు 03**

విద్యతో విజ్ఞానం, విలువలను పెంపొందించుకోవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించి అనుకున్న లక్ష్యాన్ని సాధించగల్గుతారని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్ధసారథి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. సానుకూల ఆలోచనలు, ఆశావాహ దృక్పథాన్ని అలవర్చుకుని, సరైన ప్రణాళికతో ముందుకు సాగితే నూటికి నూరు శాతం విజయం వరిస్తుందని హితబోధ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో శనివారం చిట్ల ప్రమీల జీవన్ రాజ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రతి యేటా నిర్వహిస్తున్న ఆనవాయితీని పాటిస్తూ 'విద్యా స్ఫూర్తి' కార్యక్రమం నిర్వహించారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన ఆర్మూర్ పట్టణంలోని నాలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తన తల్లిదండ్రుల పేరిట నెలకొల్పిన ట్రస్టు ఆధ్వర్యంలో అవార్డులు ప్రదానం చేశారు. బంగారు, వెండి పతకాలను బహూకరించి, చిన్నారులకు ప్రోత్సాహకాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, జిల్లా విద్యా శాఖ అధికారి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొని విద్యా స్ఫూర్తి కార్యక్రమానికి వన్నెలద్దారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్ధసారథి పలువురు విద్యార్థులను వారి వ్యక్తిగత విషయాలు, భవిష్యత్ లక్ష్యాల గురించి ప్రశ్నిస్తూ, పిల్లల సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. సానుకూల దృక్పథంతో ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తే విజయం తథ్యమని కమిషనర్ సూచించారు. ఇతరులను నిందించడం, ఎదుటివారి పట్ల అసూయ ద్వేషాలు కలిగి ఉండడం వంటి అవలక్షణాలతో సమయాన్ని వృథా చేసుకోకుండా స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని హితవు పలికారు. ముఖ్యంగా నేటితరం విద్యార్థులు తమ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అప్పుడే చదివిన చదువుకు సార్ధకత చేకూరుతుందని, తల్లిదండ్రులు, గురువుల గౌరవాన్ని పెంపొందించి వారు అవుతారని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ర్యాంకులు, మార్కులు ఎంతమాత్రం కొలమానం కాదని, సామర్థ్యాలను బట్టి ఉన్నత స్థానాలు వరిస్తాయని సూచించారు. ఈ దిశగా విద్యార్థులలో సామర్థ్యాలను



పెంపొందించి, వారి భవితవ్యాన్ని తీర్చిదిద్దేందుకు అంకిత భావంతో కృషి చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు కూడా పిల్లల కోసం ప్రత్యేకంగా కొంత సమయాన్ని కేటాయిస్తూ, నిజ జీవితాలలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని మొక్కవోని ధైర్యం, ఆత్మవిశ్వాసం, కఠోర శ్రమతో పైకి ఎదిగిన స్ఫూర్తిప్రదాతల గాథలను పిల్లలకు వివరిస్తూ వారిలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలని కర్తవ్యోన్ముఖులను చేశారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, క్రికెటర్లు మొహమ్మద్ సిరాజ్, రోహిత్ శర్మ తదితర ప్రముఖుల జీవితాలను, వారు ఏవిధమైన కష్టాలను అధిగమిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకున్నారనే విషయాలను కమిషనర్ పార్ధసారథి వివరిస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపే ప్రయత్నం చేశారు. మీ గురించి సమాజం గొప్పగా చెప్పుకునే విధంగా మారాలని, దీనికి కృషి, పట్టుదల తోడైతేనే విజయాలు సొంతం అవుతాయని అన్నారు. సాంకేతికంగా ఎంతో శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగపడే చరవాణి (సెల్ ఫోన్)ను విజ్ఞాన సముపార్జన కోసం వినియోగించకుండా, అనేకమంది దానిని దురుపయోగం చేస్తుండడం వల్ల భావి తరాలకు ఎంతో నష్టం చేకూరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా వైరస్ కంటే ఎక్కువ ప్రమాదకారిగా మారిన సెల్ ఫోన్ కు బానిసలుగా మారి భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని విద్యార్థులకు హితబోధ చేశారు. ప్రతి ఒక్కరి జీవితంలో విద్య ఎంతో ప్రాముఖ్యమైనదని, విద్యతోనే సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని, మన విలువను పెంపొందించుకోగల్గుతామని మార్గనిర్దేశం చేశారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులు కూడా ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చు అనడానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్ధసారథి ఎదుగుదల చక్కటి నిదర్శనమని అన్నారు. ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో కొనసాగుతూ, ఎంత పని ఒత్తిడిలో ఉన్నప్పటికీ తాను పుట్టిపెరిగిన ప్రాంతం, చదువుకున్న బడిని మర్చిపోకుండా విద్యార్థులను ప్రోత్సహించేందుకు తల్లిదండ్రుల పేరిట ట్రస్టును నెలకొల్పి అవార్డులు అందిస్తుండడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో నేటి విద్యార్థులు కూడా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరినా, తమ తల్లిదండ్రులను గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సెస్సీలో టాపర్లుగా నిలిచిన ఆర్మూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలు, రాంమందిర్ ఉన్నత పాఠశాల, సైదాబాద్ ఉర్దూ మీడియం జెడ్పిహెచ్ ఎస్ కు చెందిన విద్యార్థిని, విద్యార్థులకు అవార్డులతో సత్కరించి ప్రోత్సాహకాలను అందజ ేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కన్వీనర్ నర్సింలు, పాఠశాలల హెచ్.ఎంలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# స్వయం నిర్ణయాధికార స్వేచ్ఛ కోసం పోరాడాలి.

**-మహిళలకు పిఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డా" పిట్ల సరిత పిలుపు.**






**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, ఆగస్టు 3:**

సమాజంలో సగభాగం అయిన మహిళలు నేటికీ తమ స్వయం నిర్ణయాధికార స్వేచ్ఛను కలిగి లేరని, అందుకోసం పోరాడాలని పిఓడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ పిట్ల సరిత పిలుపునిచ్చారు.

నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్ లో శనివారం పిఓడబ్ల్యు నిజమాబాద్ నగర ఏడవ మహాసభ నిర్వహించారు.

ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ, దేశంలో పురుషాధిక్య భావజాలం పెచ్చుమీరుతోందని అన్నారు. మహిళలను రెండవ శ్రేణి పౌరులుగా చూస్తున్నారని అన్నారు. కుటుంబంలో గానీ, సమాజంలో గాని ఆమె ఎలాంటి నిర్ణయాలైన స్వయంగా తీసుకుననే హక్కును లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా దేశంలో మనువాద భావజాలం మరింత ప్రమాదకరంగా ముందుకు వస్తుందని అన్నారు. బిల్ కిస్ భానుని అత్యంత దారుణంగా అత్యాచారం చేసి, ఆమె కుటుంబ సభ్యులను హత్య చేసిన దుర్మార్గులకు యూపీ ప్రభుత్వం బెయిల్ మంజూరు చేయడాన్ని ఆమె తప్పు పట్టారు. హత్రాస్ ఘటనలో గాని, కతువా రేప్ కేసులో గాని నిందితులకు వత్తాసు పలికే ప్రభుత్వాల వైఖరి దారుణమని అన్నారు. బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిడ్జిభూషణ్ సింగ్ అథ్లెట్ల పట్ల వ్యవహరించిన విధానం దారుణమని ఆ ఉదంతంలో అతనిపై కేసు నమోదుకు ఉద్యమాలు చేయాల్సి వచ్చిందని అన్నారు. ఆ పోరాటంలో ప్రగతి శీల మహిళా సంఘం ముందుందని అన్నారు. మునుముందు కూడా ఇలాంటి పోరాటాల లో ముందుండాలని, మహిళా సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కూడా మహిళలపై హింస అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల హక్కులను రక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మహాసభకు ముందుగా జండా ఆవిష్కరణ చేశారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు తమ సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ, జిల్లా నాయకులు భారతి, నగర నాయకులు అనంత, సబిత ఆకుల, నీలం లక్ష్మి, పొన్ను మానస, ఆకుల స్వప్న, సురేఖ, రేఖ, గంగ రాజ్యలక్ష్మి, జి. సంజన, పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పివైఎల్ జిల్లా నాయకులు గుంట్ల రమేష్, ఐఎఫ్ టియు నగర ప్రధాన కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మూసీ బఫర్‌జోన్ 50 మీటర్లు

హైదరాబాద్: మూసీనదికి 50 మీటర్ల బఫర్‌జోన్‌తో సరిహద్దుగా నిర్ణయించి నిర్మాణాలకు నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీలు) జారీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ఆదేశాలు జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మూసీకి ఇరువైపులా పలు భారీ నిర్మాణాలకు సంబంధించిన దరఖాస్తులు ఎన్‌వోసీల కోసం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. టీజీ-బీపాస్‌లో భాగంగా వచ్చినవి కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2023 నవంబరు 17న నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆధ్వర్యంలోని కమిటీ చేసిన సిఫార్సు ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. జులై 15న నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి మెమో జారీ చేసి దాని ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

ఈఎన్సీ సూచనలేమిటంటే...

“కొత్తగా ఇచ్చే ఉత్తర్వులలో బఫర్‌జోన్/గ్రీన్‌జోన్‌ను తప్పనిసరిగా నిర్మాణాలు లేనివిగా పరిగణించాలి. కాంటూర్ సర్వే ద్వారా నీటివనరుల ఎఫ్‌టీఎల్ హద్దులను నిర్ధారించాలి. తదుపరి ఆక్రమణలు జరగకుండా, పర్యావరణాన్ని దెబ్బతీయకుండా చర్యలు తీసుకోవాలి. నీటిపారుదల శాఖ మ్యాపులు, రెవెన్యూ రికార్డులతో సరిపోలనందున నిర్మాణాలకు ఎన్‌వోసీలు జారీ చేస్తే తేడాలు వస్తాయి. అందుకని రాష్ట్రం మొత్తం రెవెన్యూ రికార్డులను ఒకే రకంగా అప్‌డేషన్ చేయాలి. ఇది నిర్ణీత వ్యవధిలో జరగాలి. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకొని త్వరగా ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయాలి” అని గత నవంబరులో ఈఎన్సీ రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇవన్నీ జరగకుండానే ఎన్‌వోసీల జారీకి తాజాగా మెమో జారీ చేసినట్లు స్పష్టమవుతోంది.

2023 జులై 25న ఈఎన్సీ నేతృత్వంలో సమావేశం

జీహెచ్ఎంసీ పరిధిలో మూసీ నదికి రెవెన్యూ రికార్డుల ప్రకారం బఫర్‌జోన్‌తో కలిపి సరిహద్దు లేదా గరిష్ఠ వరద ప్రవాహం ఆధారంగా మార్గదర్శకాల కోసం తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిపై 2023 జులై 25న ఇంజినీర్ ఇన్ చీఫ్(జనరల్) నేతృత్వంలో సమావేశం జరిగింది. అంతకు ముందు జరిగిన పరిణామాలను

కూడా అందులో చర్చించారు. 2017 జనవరి 25న జరిగిన సమావేశంలో హిమాయత్‌సాగర్ దిగువ నుంచి నాగోల్ వరకు, ఉస్మాన్‌సాగర్ ప్రాంతంలో గోడలున్న ప్రాంతంలో మినహా మిగిలిన చోట లక్షా యాభైవేల క్యూసెక్కుల కనీస ప్రవాహం వెళ్లేలా మూసీ నది ఉండాలని హైడ్రాలజీ విభాగం చీఫ్ ఇంజినీర్ సూచించారు. దీని ఆధారంగా జీహెచ్ఎంసీ పరిధిలో మూసీ రివర్ బేసిన్‌పై అధ్యయనానికి హుస్సేన్‌సాగర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లోటస్ ఇంజినీర్ కన్సల్టెన్సీ సర్వీస్‌తో ఒప్పందం చేసుకొన్నారు. బాపూఘాట్ నుంచి నాగోల్ బ్రిడ్జి వరకు 17 కి.మీ. దూరం గరిష్ఠ వరద ప్రవాహానికి తగ్గట్లుగా పిల్లర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 2019 ఆగస్టునాటికి ఈ పనిని పూర్తి చేశారు.

ఆక్రమణలకు సంబంధించిన డ్రాయింగులు అందలేదు

2017 మార్చిలో పురపాలక శాఖ మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న మ్యాప్‌ల ఆధారంగా మూసీ నది సరిహద్దును, బఫర్ జోన్‌ను నిర్ణయించడానికి ఈ కార్పొరేషన్ సమగ్ర సర్వే చేసింది. మూసీ నదిలోనూ, బఫర్‌జోన్‌లోనూ జరిగిన నిర్మాణాలను అంచనా వేయడం కూడా ఈ సర్వే ఉద్దేశం. అయితే మూసీ నది సరిహద్దులో, బఫర్‌జోన్‌లో ఆక్రమణలకు సంబంధించిన డ్రాయింగులు ఇప్పటివరకు హైదరాబాద్ లేక్స్ సర్కిల్ ఎస్ఈకి అందలేదని గత నవంబరు 17న నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖపై మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ సమాధానం ఇచ్చారు.

# కాంగ్రెస్ హామీలతో ప్రజలను మోసగించింది.

## గ్యారంటీలకు, డిక్లరేషన్లకు బడ్జెట్ లో నిధులు కేటాయించక పోవడమే నిదర్శనం.

## బీజేపీ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఆగస్టు 3**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట ప్రజలను మోసగించిందని బీజేపీ అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. గ్యారంటీలకు, డిక్లరేషన్లకు బడ్జెట్ లో నిధులు కేటాయించక పోవడమే నిదర్శనం అని అన్నారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట ప్రభుత్వంప్రవేశపెట్టిన బడ్జెట్ అరచేతిలో వైకుంఠం చూపెట్టి విధంగా ఉందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యస్థాపన అంటు ప్రజలను నయ వంచనకు గురి చేసిందని, కాంగ్రెస్ గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజలకు ఈ బడ్జెట్ వల్ల ఒరిగింది ఏమి లేదన్నారు. ఆరు గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్ల, 420 హామీలతో అధికారంలోకి వచ్చి 100 రోజుల్లో అమలుచేస్తానన్నా హామీలను ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. మహిళలకు ఇస్తానన్న 2500, ఇందిరమ్మ ఇండ్లు, విద్యార్థులకు విద్య భరోసా 5 లక్షలు, చేయూత కింద పెన్షన్ 4000 ల పెంపు విటన్నిటికీ కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ లో ఎలాంటి కేటాయింపులు లేవని అన్నారు. వరంగల్ భద్రకాళి అమ్మవారి సాక్షిగా, రాహుల్ గాంధీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్ పేరుతో మోసం చేసిందని, రైతులకు, కౌలు రైతులకు 15000, వరి పంటకు బోనస్ 500, 24 గంటల నిరంతర ఉచిత కరెంటు అని, ఏక కాలంలో 2లక్షల రుణమాఫీ అని చెప్పి ఇప్పుడు అనేక ఆంక్షలతో, నిబంధనలతో కొంత మందికే రుణమాఫీ చేసి మిగతా గ్యారంటీలకు శటగోపం పెట్టిందన్నారు. అర్హులైన రైతులు రుణమాఫీ కోసం బ్యాంకుల ముందు ధర్నా చేసే పరిస్థితి ఉందన్నారు.



హైదరాబాద్ భాగ్యలక్ష్మి అమ్మవారి సాక్షిగా యావత్ నిరుద్యోగులను, యువతను యూత్ డిక్లరేషన్ పేరుతో మోసం చేసిందని, 2 లక్షల ఉద్యోగాలు పూర్తి చేస్తామని, నిరుద్యోగ భృతి 4 వేలు ఇస్తాం అని చెప్పి గద్దెనెక్కిన, ప్రస్తుతం నోరు మెదపడం లేదని అన్నారు. రేవంత్ సర్కార్ తన పార్టీలో ఉన్న రాజకీయ నిరుద్యోగులకు మాత్రం కులానికో కార్పొరేషన్ పెట్టి పదవులు ఇచ్చి జీతాలు చెల్లిస్తుంది కానీ, ఆ కార్పొరేషన్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా బడ్జెట్ పెట్టకపోవడం సిగ్గు చేటన్నారు. తెలంగాణలో 50శాతం పైగా ఉన్న బిసి వర్గాన్ని వంచించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ లో కేవలం 9 వేల నిధులు కేటాయించిందన్నారు. స్థానిక ఎన్నికల్లో 23 నుండి 42 శాతం రిజర్వేషను పెంచుతామన్నా హామీని వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేసారు. కల్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 8 నెలలో 8 మీటర్ల రోడ్ కూడా వేయలేదని, రోడ్స్, డ్రైనేజీ అధ్వణమైన పరిస్థితిలో ఉన్నాయని అన్నారు. 45 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన 680 సీటింగ్ కెపాసిటీ ఉన్న ఐటి హబ్ లో లీడింగ్ కంపెనీలు తీసుకొచ్చి, ఇక్కడ ఉన్న యువతకు ఉపాధి కల్పించాలని మంత్రి శ్రీధర్ బాబును కోరడం జరిగిందన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ బోధన్, ముత్యం పేట్ షుగర్ ఫ్యాక్టరీ చేరిపించడమే కాకుండా అభివృద్ధికి నిధులు విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ లో మౌలిక సౌకర్యల కల్పనతో పాటు ఇంజనీరింగ్ కళాశాల మంజూరుకు డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి.

## - సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ నగర కార్యదర్శి ఎం. సుధాకర్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఆగస్టు 3:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చెయ్యాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నగర కమిటీ ఆధ్వర్యంలో ఉత్తర మండల తహసిల్దార్ కార్యాలయం ముందు శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ నగర కార్యదర్శి ఎం. సుధాకర్ మాట్లాడుతూ, గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, నియంతృత్వ విధానాలను అవలంబించిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, సంక్షేమ పథకాలు, ప్రజా పాలన అందిస్తామన్న హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను, వాగ్దానాలను వెంటనే అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలిచ్చి, ఇల్లు కట్టుకోవడానికి 10 లక్షల రూపాయలివ్వాలన్నారు. నగరంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిరుపేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమగ్రంగా అమలు చేయాలన్నారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళ, బీడీ కార్మికుల పెన్షన్లు పెంచాలన్నారు. స్కాలర్షిప్, ఫీజు




రీయంబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించాలన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించాలన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. యువత ఉపాధికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి పి.డి.ఎస్.యు జిల్లా ప్రధానకార్యదర్శి కే.గణేష్, ఐ.ఎఫ్.టి.యు జిల్లా నాయకులు బి.లింగం మరియు గీత, అమూల్య, దళిత, మహిపాల్, నసీర్, సృజన్, హన్మండ్లు, ఫర్జానా, లక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.


# సోషల్ మీడియా ట్రోల్స్ పట్టించుకోను



మనసులో మాట చెప్పిన బ్యూటీ జాన్వీ

తనపై ప్రముఖ సోషల్ మీడియా వెబ్‌సైట్ రెడిట్‌లో వచ్చే ట్రోల్స్ గురించి తన సోదరి చెప్పేవరకు తెలియదని బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ అన్నారు. తాజా చిత్రం ’ఉలఝ్’ ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వీటిపై స్పందించారు. ’నాకు సోషల్ మీడియా అంటే భయం. దానికి దూరంగా ఉంటాను. ’రెడిట్‌లో చాలా మంది నిన్ను ట్రోల్ చేస్తున్నారు అక్క’ అని ఖుషీ చెప్పే వరకు నాకు తెలియదు. వాటిని చూశాక ఎలా స్పందించాలో అర్థంకాలేదు. అందులో దారుణమైన ట్రోల్స్ కూడా ఉన్నాయి. వాటిని నేను పట్టించుకోను’ అని చెప్పారు. గతంలోనూ జాన్వీ ఆన్‌లైన్ వేదికగా స్టార్ కిడ్స్ ఎదుర్కొంటున్న విమర్శలపై పలుసార్లు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ‘సామాజిక మాధ్యమాల్లో వచ్చే విమర్శలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, సోషల్‌మీడియా కల్చర్ అది. నువ్వు పబ్లిక్ ఫిగర్ అయినా, కాకపోయినా ఇలాంటివి నిరంతరం జరుగుతూనే ఉంటాయి. ఆ కామెంట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఒక విషయంలో ఈరోజు పొగిడిన వాళ్లే.. రేపు తిడతారు. మనకు తెలియని వాళ్లు ఏదో అన్నారని ఇంట్లో కూర్చొని ఏడవడం ఎందుకు‘ అని అన్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీ ’ఉలఝ్’ ప్రమోషన్‌లో బిజీగా ఉన్నారు. జాతీయ అవార్డు గ్రహీత సుధాంశు సరియా తెరకెక్కించారు. జాన్వీ ఇందులో ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారిణిగా కనిపించనుంది. ఈ పొలిటికల్ థ్రిల్లర్‌లో గుల్షన్ దేవయ్య, రాజేశ్ థైలాంగ్ ముఖ్య పాత్రలు పోషించారు.

# కష్టాలను నవ్వుతూ ఎదుర్కోవాలి



జాతిరత్నాలు ఫేమ్ హీరో నవీన్ పొలిశెట్టికి ఇటీవలే అమెరికాలో యాక్సిడెంట్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆయన చేతికి,కాలికి ఫ్రాక్చర్ అయింది. తనకు జరిగిన ప్రమాదంపై, తాను ఉన్న పరిస్థితిపై తన ఫ్యాన్స్ కోసం ఇటీవలే సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టాడు. ఈ నేపథ్యంలో జరిగిన ప్రమాదం నుంచి..కోలుకునే పక్రియ కాస్త నెమ్మదిగా సాగుతోందని నవీన్ పోలిశెట్టి వెల్లడించారు. తాజాగా నవీన్ పొలిశెట్టి అభిమానుల కోసం చేతికి కట్టుతో ఉన్న కొత్త వీడియోను షేర్ చేశాడు. ’లైఫ్ ఒక జిందగీ అయిపోయింది..త్వరలో కలుద్దాం జానే జిగర్స్’ అంటూ క్యాప్షన్ తో ప్రస్తుత హెల్త్ అప్‌డేట్ ఇచ్చారు. ’సింగిల్ హ్యాండ్ గణెళిశ్’ అంటూ వెంకటేశ్ చెప్పిన డైలాగు..’చెయ్యి చూశావా ఎంత రఫ్‌గా ఉందో’ అని చిరంజీవి చెప్పిన డైలాగులను టీవీలో పెట్టుకొని తనను తానే ట్రోల్ చేసుకుంటూ నవ్వులు పూయించారు. అలాగే మరికొన్ని మీమ్స్ తో ఫ్యాన్స్ ను నవ్వించే ప్రయత్నం చేస్తూనే ప్రస్తుతం తాను పడే కష్టాన్ని చూపెట్టాడు. ఇక చివర్లో ’జీవితంలో వచ్చిన కష్టాలను నవ్వుతూ ఎదుర్కోవాలి. ’హాస్యమే మనకు ధైర్యాన్నిస్తుంది. మీ అందరినీ నవ్వించడం నాకెంతో

ఇష్టం. పూర్తిగా కోలుకున్న తర్వాత బిగ్ స్క్రీన్‌పై మీ అందరినీ కలుస్తాను’ అని వీడియోలో రాసుకొచ్చారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఇటీవలే మిస్ శెట్టి మిస్టర్ పిలిశెట్టి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నవీన్ డీసెంట్ హిట్ అందుకున్నాడు. ఈ సినిమా తరువాత అనగనగా ఒకరాజు అనే సినిమా చేస్తున్నారు నవీన్. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాలో లేటెస్ట్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ సినిమా కాకుండా మరో రెండు క్రేజీ సినిమాలను కూడా లైన్లో పెట్టాడు నవీన్ పోలిశెట్టి.

# సూర్య కంగువతో పోటీపడలేరు: నిర్మాత

శివ దర్శకత్వంలో సూర్య ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం ’కంగువా’ రెండు భాగాలుగా ఇది రానుంది. ఫాంటసీ యాక్షన్ ఫిల్మ్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్ర నిర్మాత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సినిమాపై అంచనాలను పెంచారు.అక్టోబర్ 10న ఈ చిత్రం విడుదల కానున్న విషయం తెలిసిందే. ఇదే తేదీన మరికొన్ని చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఈ పోటీపై నిర్మాత కేఈ జ్ఞానవేల్ మాట్లాడుతూ.. ‘కంగువ’ కంటెంట్ గురించి తెలియదు కాబట్టి.. దీని మొదటి భాగం వచ్చే తేదీకి మరికొన్ని సినిమాలు విడుదలయ్యే అవకాశం ఉంది. కానీ, ’కంగువ2’తో మాత్రం ఎవ్వరూ పోటీకి రాలేరు. ఈ విషయాన్ని నమ్మకంతో చెబుతున్నాను. సినిమా కంటెంట్ అంత బలమైనది’ అని చెప్పారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. గతంలోనూ నిర్మాత సినిమా ఫలితంపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. రూ.1000 కోట్లు సాధించడమే లక్ష్యమన్నారు. సీక్వెల్‌కు కథ సిద్ధంగా ఉందన్నారు. పార్ట్ 1 విజయం ఆధారంగా సీక్వెల్ ఎ÷-లాన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమా సూర్యని మరో స్థాయికి తీసుకెళ్తుందని నమ్ముతున్నట్లు చెప్పారు.

